సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 9 । మార్చి । 2023



రూ.లక్ష విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు యనమదల సూర్యనారాయణ, పార్వతి దంపతులు (డిప్పకాయలపాడు) బుధవారం రూ. 1,00,116 విరాళం ఇచ్చారు.



నిత్యాన్నదానానికి రూ.50 వేలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కల్వకొలను ఆదినారాయణ దంపతులు (తాతాజీ - అమలాపురం) బుధవారం రూ.50 వేల విరాళం అందజేశారు.

వెండి కిరీటం సమర్పణ



మామిడికుదురు: పెద పట్నంలంక గ్రామ దేవత శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి కొమ్ముల సత్యనారాయణ (శివ), గౌరీచందు దంపతులు రూ.1.50 లక్షల విలువైన రెండు కిలోల వెండి కిరీటాన్ని బుధవారం సమర్పించారు.

న్యూస్‌రీల్

నృసింహస్వామికి రూ.23.78 లక్షల ఆదాయం



శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

మధురపూడి: కల్యాణోత్సవాలను పురస్కరించుకుని కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి దండిగా ఆదాయం సమకూరింది. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా కొండ పైన, దిగువన ఉన్న ఆలయాల్లోని 22 హుండీలను బుధవారం తెరచి, ఆదాయం లెక్కించారు. స్వామి వారి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. హుండీల ద్వారా రూ.12,71,10, లడ్డూల విక్రయం ద్వారా రూ.3,94,220తో పాటు దర్శనాలు, కల్యాణాలు కలిపి మొత్తం రూ.23,77,736 ఆదాయం వచ్చింది. నోట్ల లెక్కింపు యంత్రం ఒక్కటి మాత్రమే ఉండటం, కొండ పైనుంచి హుండీలను దిగువకు తీసుకురావడంలో జాప్యం జరగడంతో ఆదాయం లెక్కింపు ఆలస్యమయ్యింది.

వేడుకగా శ్రీపుష్పయాగం

కల్యాణోత్సవాల్లో భాగంగా రాత్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి శ్రీపుష్పయాగం (పర్యంక శయనోత్సవం) వేడుకగా నిర్వహించారు. వివిధ రకాల ప్రసాదాలు, పండ్లను స్వామి, అమ్మవార్లకు నివేదించారు. ఈ సందర్భంగా విశేష పుష్పాలంకరణ చేశారు. తొలుత సాయంత్రం 6 గంటలకు పుణ్యాహవాచనం, స్వామివారికి ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ బి.సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి అండర్-17 చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం సిటీ): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యాన ఈ నెల 12వ తేదీ నుంచి శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్‌లో అండర్-17 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తున్నారు. సంఘం కార్యదర్శి జీవీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఏపీచెస్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాజమహేంద్రవరం, అనపర్తి, రాజానగరం, రంపచోడవరం, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులన్నారు. వివరాలకు 98483 74133 నంబరులో సంప్రదించాలని కోరారు.

14, 18 తేదీల్లో డీవార్మింగ్ డే

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఈ నెల 14, 18 తేదీల్లో నులిపురుగుల నివారణ దినం (డీవార్మింగ్ డే) నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక నారాయణపురం పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. డీవార్మింగ్ డే నిర్వహణపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగు నివారణ మందు వైద్యుల సలహా మేరకు తప్పక వేయాలని అన్నారు. బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీలు, సంస్థల్లో లైంగిక వేధింపులపై చర్యలు తీసుకునేలా ఆరుగురు సభ్యులతో కూడిన ఇంటర్నల్ కంప్లయింట్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీలో డీఎల్ఏటీఓ డాక్టర్ ఎస్.వసుంధర, డీఈఓ ఇన్‌చార్జ్ డాక్టర్ జి.వరలక్ష్మి, డీఎస్ఎంఓ డాక్టర్ పి.లక్ష్మీదేవి, పీఎంఓ పి.వీరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎ.రజియా అహ్మద్, జూనియర్ అసిస్టెంట్ ఎం.మంజూరెడ్డి సభ్యులుగా ఉంటారని వివరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కమిటీ తగు నిర్ణయాలు తీసుకుంటుందని డీఎంహెచ్ఓ తెలిపారు.

సమాన భాగస్వామ్యంతో సమాజాభివృద్ధి





ఆకాశంలో సగం.. అన్నిటా సగం..: సాంస్కృతిక ప్రదర్శనతో ఆకట్టుకున్న బాలికలు, వేడుకల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు



వేడుకల్లో అలరించిన నృత్యాభినయం

- అన్ని రంగాల్లోనూ మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలి
- మహిళా దినోత్సవ సభలో కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అన్ని రంగాల్లోనూ మహిళలకు సమాన భాగస్వామ్యం, సముచిత స్థానం కల్పించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఆనం కళాకేంద్రంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ఎవ్వరికీ తక్కువ కాదనే ఆలోచన మనలో ఉండాలని అన్నారు. గ్రామ/వార్డు వలంటీర్లలో 80 శాతం మహిళలే ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా, చేయూత, చేదోడు, అమ్మ ఒడి, ఇంటి స్థలాలు తదితర అన్ని పథకాలనూ మహిళల పేరిట ఇస్తూ వారి ఎదుగుదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని చెప్పారు. మహిళలు సమర్థత కలిగి ఉంటారనే నమ్మకమే వారికే ప్రాధాన్యం ఇవ్వడానికి కారణమని అన్నారు. మహిళలు తమ ప్రతిభను గుర్తించి, అందులో విజయం సాధించేందుకు నిరంతర కృషి చేయాలని, తన విజయం వెనుక భర్త ప్రోత్సాహం ఉందని కలెక్టర్ చెప్పారు.

రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, మహిళల పట్ల వివక్షను రూపుమాపేందుకే నేడు వారికి సమున్నత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నింటిలోనూ మహిళలకు చేదోడుగా నిలుస్తోందని, ఆర్థికంగా వారిని బలోపేతం చేస్తోందని గుర్తు చేశారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాల్లోనూ మహిళలకు పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ, తన విజయం వెనుక తల్లి, భార్య ఉన్నారని చెప్పారు. లింగ వివక్ష లేని సమాజ నిర్మాణానికి ఐక్యంగా పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కలెక్టర్ మాధవీలతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, మహిళా అధికారులు పాల్గొన్నారు.

కష్టపడటమా.. కష్టమే!

- శారీరక శ్రమ లేని కొలువుల పైనే యువత దృష్టి
- ఎలక్ట్రికల్, మెకానికల్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడ్‌లకు దూరం
- ప్రైవేటు ఐటీఐలలో భారీగా మిగిలిపోతున్న సీట్లు
- ఆయా రంగాల్లో నిపుణుల కొరత
- ప్రభుత్వ ఐటీఐలో సరికొత్త కోర్సులకు నాంది



ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందివస్తున్న ప్రస్తుత తరుణంలో అత్యధిక శాతం యువతీయువకులు శారీరక శ్రమతో కూడిన, ఒళ్లు వంచి పని చేసే తరహా ఉద్యోగాలు చేయడం కష్టమేనని అంటున్నారు. వీలైనంత వరకూ వైట్ కాలర్ జాబ్‌లు సాధించాలనే ప్రయత్నిస్తున్నారు. ఇందుకు తగిన కోర్సులనే ఎంపిక చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు కష్టపడకూడదని భావించడం ఇందుకు మరింత దోహదం చేస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ వంటి కోర్సుల పైనే దృష్టి సారిస్తున్నారు. బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తయితే ఏసీ గదుల్లో కూర్చుని ఉద్యోగాలు చేసుకోవచ్చని భావిస్తున్నారు. ఐటీఐలు అందించే ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ వంటి కోర్సులపై విముఖత చూపుతున్నారు. దీంతో ఐటీఐలలో ఏటా వందలాది సీట్లు మిగిలిపోతున్నాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఒక ప్రభుత్వ, 12 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి. వీటి ద్వారా 7 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం అన్ని ఐటీఐలూ కలిపి 2,084 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది 854 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రైవేటు ఐటీఐలలో మొత్తం 1,250 సీట్లు మిగిలిపోగా.. ప్రభుత్వ ఐటీఐలో మాత్రం మొత్తం 132 సీట్లూ భర్తీ అయ్యాయి. గతంలో ఎలక్ట్రికల్, ఫిట్టర్, మెకానికల్ కోర్సులకు ఎక్కువ ఆదరణ ఉండేది. కొంత కాలంగా వీటిపై ఆసక్తి తగ్గుతోంది. ఈ కోర్సులు చేస్తే వర్కర్లుగా పని చేయాలి, శారీరక శ్రమ అధికం అన్న భావనతో యువతీయువకులు ఇంజినీరింగ్ విద్యపై దృష్టి సారిస్తున్నారు. అక్కడైతే కంప్యూటర్ ముందుకు కూర్చొని ఉద్యోగం చేయవచ్చని ఎక్కువ మంది భావిస్తున్నారు. దీనికి తోడు అధిక శాతం ప్రైవేటు ఐటీఐలు కేవలం కోర్సు పూర్తి చేశామా.. పంపించేశామా.. అన్నట్టుగానే వ్యవహరిస్తున్నాయి. మారుతున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కోర్సులలో నవీకరణ ఉండటం లేదు. ఇది కూడా ప్రైవేటు ఐటీఐలలో అడ్మిషన్లు తగ్గడానికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఐటీఐ పేరు	మొత్తం సీట్లు	భర్తీ అయినవి	మిగిలిపోయినవి
శ్రీరామ, కొమరపాలెం	176	32	141
జేఎస్ఎం ఎక్సర్, రాజమహేంద్రవరం	228	35	193
వివేకానంద, ధవళేశ్వరం	472	313	159
వెస్లీ, రాజానగరం	140	40	100
జస్వంత్, కోరుకొండ	100	53	47
పైడి, తాళ్లపూడి	160	39	121
శ్రీనివాస, కొవ్వూరు	80	20	60
జేఎస్ఎం ఎక్సర్, కొవ్వూరు	64	22	42
నాగార్జున, శంకరాపురం	80	5	75
ఎస్‌వీఆర్ఎం, పెరవలి	144	30	114
ఎస్ఎస్‌జీఎం, నిడదవోలు	160	100	60
ఎల్‌పీఎంపీ, నల్లజర్ల	148	30	118
ప్రభుత్వ ఐటీఐ, రాజమహేంద్రవరం	132	132	0

భవిష్యత్తు స్కిల్‌దే..

ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన స్కిల్డ్ వర్కర్లకు భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆస్పత్రులు, బ్యాంకులు, రియల్ ఎస్టేట్‌తో పాటు నిర్మాణ రంగంలో స్కిల్డ్ వర్కర్ల అవసరం భారీగా ఉండబోతోంది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలో పట్టణీకరణ, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయ రంగాల విస్తరణ జరుగుతోంది. రాబోయే నాలుగేళ్లలో 41.41 లక్షల మంది స్కిల్డ్ వర్కర్లు అవసరమవుతారని, అయితే ఏటా 2.85 లక్షల మంది మాత్రమే కోర్సులు ముగించుకుని బయటకు వస్తున్నారని నిపుణులు అంటున్నారు. దీనికితోడు దేశ వ్యాప్తంగా కియా, హ్యుండాయి, మారుతీ తదితర ఆటోమొబైల్ పరిశ్రమల్లో ఫిట్టర్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగ నిపుణుల అవసరం ఉంది. కారు, బైక్ మెకానిక్ నిర్మాణ రంగంలో ఫిట్టింగ్, ఎలక్ట్రికల్ విభాగాల్లో పని చేసే వారి సంఖ్య రోజు రోజుకూ తగ్గుతోంది. మెకానిక్ నుంచి ఎలక్ట్రికల్, ఫిట్టర్ వరకూ అసిస్టెంట్ల కొరత వేధిస్తోంది. ఎలక్ట్రీషియన్ ఒక ఇంటికి విద్యుత్ పని చేస్తే నెలకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకూ సంపాదిస్తున్నాడు. బైక్ మెకానిక్, ఫిట్టర్లు కూడా రోజుకు కనీసం రూ.3 వేలు తక్కువ కాకుండా సంపాదిస్తారు. దీని ప్రకారం వీరి సంపాదన కూడా నెలకు రూ.90 వేలకు పైనే ఉంటోంది. అయినప్పటికీ యువత సాఫ్ట్‌వేర్ వైపే దృష్టి సారిస్తోంది.

నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహిస్తోంది. 6 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్ సెంటర్లు తెరిచారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తయిన నిరుద్యోగులకు 45 నుంచి 60 రోజుల పాటు పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చి, వివిధ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణ



ఫిట్టర్ విభాగంలో గతంలో లేత్ మెషీన్లు ఉండేవి. ఇప్పుడు సీఎన్‌జీ యంత్రాలతో కూర్చొని పని చేయవచ్చు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ అప్‌డేట్ అవ్వాలి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. షార్ట్ టెర్మ్ కోర్సులు పెడుతున్నాం. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డేటా ఎంట్రీ, ఏసీ మెకానిక్, కటింగ్,టైలరింగ్ వంటి నూతన కోర్సులు ప్రారంభిస్తున్నాం. ట్యాలీ కోర్సు ద్వారా ఇప్పటికే రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో 26 మందికి ఉద్యోగాలు కల్పించాం. కంప్యూటర్ ఆపరేటర్, డ్రెస్ మేకింగ్ వంటి అధునాతన కోర్సులను ప్రారంభించడం ద్వారా ఐటీఐల మనుగడ కాపాడుతున్నాం.

– రమణారావు, ప్రిన్సిపాల్ ప్రభుత్వ ఐటీఐ, బొమ్మూరు


త్వరలో ఎన్ఐఆర్‌సీఏగా సీటీఆర్ఐ



సీఎస్ఐఆర్ - ఐఐసీటీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీటీఆర్ఐ) త్వరలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆఫ్ కమర్షియల్ అగ్రికల్చర్(ఎన్ఐఆర్‌సీఏ)గా మారనుంది. ఈ విషయాన్ని రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)తో సీటీఆర్ఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందన్నారు. అలాగే కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)తో కూడా నిర్దిష్ట అంశాలపై అవగాహన ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. పలు అంశాలపై సంయుక్త పరిశోధనలు నిర్వహించేందుకు ఐసీఏఆర్ - సీటీఆర్ఐ (ఎన్ఐఆర్‌సీఏ), సీఎస్ఐఆర్ - ఐఐసీటీల మధ్య కూడా అవగాహన కుదిరిందని వివరించారు. పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం, పొగాకు మొక్కల్లోని క్రియాశీల ఔషధ పదార్థాల విశ్లేషణ, ప్రామాణీకరణ, బయోయాక్టివ్ సమ్మేళనాల విశ్లేషణలో మద్దతు, పొగాకు వ్యర్థాలను వాణిజ్యపరంగా ఉపయోగించడం వంటి అంశాలపై పరిశోధనలు చేస్తామని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా ఐసీఏఆర్ - సీటీఆర్ఐ (ఎన్ఐఆర్‌సీఏ), సీఎస్ఐఆర్ - ఐఐసీటీ సంయుక్తంగా పని చేస్తాయని డాక్టర్ శేషుమాధవ్ పేర్కొన్నారు.

డెల్టాలకు 7,350 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 7,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.55 అడుగులకు చేరింది.

నిద్రలేచి నిందలా? నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్

- అశోక్‌గజపతిరాజు ఆనాడు నోరెందుకు తెరవలేదు?
- చంద్రబాబు వల్లే రాష్ట్రానికి అన్యాయం
- ఎంపీ భరత్‌రామ్



సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో వైఎస్సార్ సీపీ ఎంపీల పని తీరు బాగోలేదంటూ మాజీ కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు విమర్శించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో కేంద్రమంత్రి హోదాలో ఉన్న ఆయన.. కేంద్రం స్పెషల్ ప్యాకేజీ ఇస్తామని ప్రకటిస్తే ఆనాడు నోరు మెదపకుండా నిద్రపోయి, ఇప్పుడు నిద్ర లేచినట్టు నిందలు వేస్తారా అని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని నాడు టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారని, దీనికి బదులు ఆనాడు ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తేనే సీఎంగా ప్రమాణ స్వీకారం, సంతకం చేస్తానని అంటే అప్పుడే వచ్చేది కదా అని ప్రశ్నించారు. చంద్రబాబు వల్లే రాష్ట్రానికి తీరని అన్యా యం జరిగిందన్నారు. తా ము అప్పటి టీడీపీ ఎంపీల్లా సన్నాయి నొక్కులు నొక్కడం లేదని, అవకాశం దొరికినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నామని గుర్తు చేశారు. ఉత్తర కుమారుడిలా ప్రగల్భాలు పలుకుతున్న లోకేశ్ భాష, బాధ ఏమిటో ఆయన వెంట తిరిగే వారికైనా అర్థమవుతోందా అని ప్రశ్నించారు. కాపురం తెలంగాణలో, రాజకీయ డ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లోనా అని దుయ్యబట్టారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల మేర ఎంవోయూలు కుదరడం చూసి ప్రతిపక్షాలు ఏడుస్తున్నాయన్నారు. పారిశ్రామిక దిగ్గజాలు వస్తే అభినందించాల్సింది పోయి విమర్శించడం ద్వారా ప్రతిపక్షాల నైజం బహిర్గతమైందని పేర్కొన్నారు. ఎంపీ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. 'నేను ఏకచిత్ర నటుడినైనా హీరోనే. నీకూ ఒక కామెడీ క్యారెక్టర్ ఇప్పిస్తా. నోరు అదుపులో పెట్టుకో రఘూ..' అంటూ ఎంపీ భరత్ హెచ్చరించారు.

- టైమ్ టేబుల్‌లో స్వల్ప మార్పు
- 1 - 9 తరగతులకు ఎఫ్ఏ-4 పరీక్షలు

రాయవరం: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారం నుంచి నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి ముందు నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షలు విద్యార్థుల స్థాయిని తెలుసుకునేందుకు ఉపయోగపడనున్నాయి. ప్రీ ఫైనల్‌కు సంబంధించి తొలుత విడుదల చేసిన షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. ఈ పరీక్షలు ఉదయం కాకుండా మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకూ నిర్వహిస్తారు. ప్రీ ఫైనల్ పరీక్షలకు ప్రింటెడ్ పేపర్లు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే పరీక్ష పేపర్లు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. పరీక్ష పత్రాలను ఏరోజుకారోజే విడుదల చేస్తారు.

ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్ ఇదీ..

తొమ్మిదో తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు) 100 మార్కులకు, కాంపోజిట్ కోర్సు విద్యార్థులకు 70 మార్కులకు నిర్వహిస్తారు. 10న సెకండ్ లాంగ్వేజ్ హిందీ, 14న ఇంగ్లిషు, 15న గణితం, 16న సైన్స్, 17న సోషల్, 18న ఓఎస్ఎస్‌సీ (సంస్కృతం, అరబిక్, పర్షియన్) పేపర్-1, 20న ఓఎస్ఎస్‌సీ (సంస్కృతం, అరబిక్, పర్షియన్) పేపర్-2 నిర్వహించనున్నారు.

నేటి నుంచే ఎఫ్ఏ-4

విద్యా శాఖ ఏటా నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ), రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ) పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎఫ్ఏ పరీక్షల్లో చివరివైన ఎఫ్ఏ-4 పరీక్షలు 1 - 9వ తరగతుల విద్యార్థులకు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇవి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 14వ తేదీ వరకూ పాత విధానంలోనే జరగనున్నాయి. వీటికి పేపర్లను ఆన్‌లైన్‌లో ఆయా ప్రధానోపాధ్యాయులకు పంపించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఎయిడెడ్ యాజమాన్యంలో 15,956, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో 4,71,958, ప్రైవేటు యాజమాన్యంలో 2,59, 838 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. వచ్చే నెలలో జరగనున్న ఎస్ఏ-2 పరీక్షలను 1-8 తరగతులకు సీబీఏ విధానంలోను, తొమ్మిదో తరగతికి మాత్రం పాత విధానంలోను నిర్వహించనున్నారు.

కట్టుదిట్టంగా నిర్వహించాలి



పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ప్రీ ఫైనల్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలి. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా నిర్వహించేలా కింది స్థాయి వరకూ ఆదేశాలు ఇచ్చాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

పేదల బియ్యం పక్కదారి

- 23 టన్నులు స్వాధీనం
- అక్రమ రవాణాపై అధికారుల నిఘా



ఆలమూరులో సీజ్ చేసిన రేషన్ బియ్యం లారీ, నిందితుడితో అధికారులు

ఆలమూరు: పేదల బియ్యం పక్కదారి పడుతోంది.. గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతోంది.. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడే నిఘా ఉంచింది. అక్రమార్కుల భరతం పడుతోంది.. మూడు రోజుల వ్యవధిలోనే ఆలమూరు మండలం జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లో సుమారు రూ.70 లక్షల విలువైన అనేక టన్నుల రేషన్ బియ్యం, మినీ వ్యాన్, లారీని సీజ్ చేయడం గమనార్హం. ఆ వివరాలలోకి వెళితే.. సోమవారం జొన్నాడలో 5.3 టన్నుల బియ్యం లోడుతో వ్యాన్‌ను సీజ్ చేశారు. ఇదిలా ఉంటే బుధవారం ఆలమూరు ప్రధాన రోడ్డులో పది చక్రాల లారీలో తరలిస్తున్న 910 బస్తాల్లో నింపిన 23 టన్నుల రేషన్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం, లారీ విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అంచనా. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో ఓ రైస్‌మిల్లు నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా కాకినాడకు తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్థానిక ఎస్.మలుపు వద్ద బియ్యం లారీని ఆపి తనిఖీలు చేశారు. రేషన్ బియ్యం అని గుర్తించిన అధికారులు ఆ వాహనాన్ని ఆలమూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎంఎస్‌ఓ టి.సుబ్బరాజు నేతృత్వంలోని పౌరసరఫరాల శాఖ అధికారులు పరీక్షించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు సీజ్ చేసిన బియ్యాన్ని మండపేట గోడౌన్‌కు తరలించగా లారీని పోలీసులకు అప్పగించారు. ద్రాక్షారామకు చెందిన డ్రైవర్ బత్తుల ధనరాజును అదుపులోకి తీసుకుని మిగతా వ్యక్తుల పాత్రపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులం పిలుస్తోంది.. రారమ్మని..



గురుకుల పాఠశాల

- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు
- ఈ నెల 24 వరకూ గడువు
- వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష

రాయవరం: చదువరులకు ఇదో సదావకాశం.. గురుకులం రారమ్మని పిలుస్తోంది.. ఉచిత విద్య అందించేందుకు దరఖాస్తులు కోరుతోంది.. పేద, మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో చేరేందుకు దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. కార్పొరేట్ తరహాలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే వసతితో పాటు ఇంటర్మీడియేట్ వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు నీట్/ఐఐటీలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏప్రిల్ 23న జరిగే కామన్ టాలెంట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 21 గురుకులాలు ఉన్నాయి. అనపర్తి మండలం కొత్తూరు జూనియర్ కళాశాల మినహా మిగిలిన 20 గురుకులాల్లో ఐదో తరగతికి 80 సీట్లు చొప్పున 1,600, తుని మండలం లోవకొత్తూరులోని పాఠశాల మినహా మిగిలిన 20 జూనియర్ కళాశాలల్లో 1,600 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలికలకు 16, బాలురకు 5 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో తొమ్మిది, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఆరు చొప్పున గురుకుల పాఠశాలలున్నాయి. ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసినప్పుడే నీట్, ఐఐటీ శిక్షణల్లో దేనిని తీసుకుంటారో ఆప్షన్ ఇవ్వాలి. వారిని ప్రభుత్వం నిర్వహించే కామన్ పరీక్షలకు పంపిస్తారు. ఉత్తమ ప్రతిభ చూపితే రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పరీక్షలకు పంపుతారు. ఇందులో రాణిస్తే కర్నూలు (చిన్నటేకూర్), గుంటూరు (గోరంట్ల), విజయవాడ (ఈడుపుగల్లు) గురుకులాల్లో నీట్, ఐఐటీలకు శిక్షణ ఇస్తారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా 700 సీట్లు కేటాయిస్తారు.

అర్హతలు ఇవీ..

ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టడ్ క్రిస్టియన్ (బీసీ–సీ) విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు 2022–23 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2023 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు దాటకూడదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాది సడలింపు ఉంటుంది. విద్యార్థులు సొంత జిల్లాలో 2021–22 ఏడాదిలో 3వ తరగతి, 2022–23 ఏడాదిలో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలి. ఐదు, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోనున్న విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు.

దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐదో తరగతికి హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్‌ఏజీ సీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ కాగా, ఇంటర్‌కు హెచ్‌టీటీపీఎస్://ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ఇంటర్ ద్వారా ఈ నెల 24న సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలను తప్పనిసరిగా రాయాలి. వివరాలు సబ్మిట్ చేసిన తర్వాత మార్చుకోవడానికి అవకాశం ఉండదు.

పదో తరగతి, ఇంటర్ గురుకుల పాఠశాలలు

ప్రాంతం	ఎస్ఎస్‌సీ	ఇంటర్
తూర్పుగోదావరి జిల్లా		
ఎల్ఎన్ పురం	బాలురు	సీఈసీ, హెచ్‌ఈసీ
బొమ్మూరు	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
వీరలంకపల్లి	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
కొవ్వూరు	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
కోమటికుంట	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
కొత్తూరు జేసీ	-----	ఎంపీసీ, బైపీసీ (బాలురు)
కాకినాడ జిల్లా		
పి.వెంకటాపురం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
ఎ.మల్లవరం	బాలురు	ఎంపీసీ, బైపీసీ (బాలురు)
సాంబమూర్తినగర్ బాలికలు	ఎంపీసీ, బైపీసీ	
ఏలేశ్వరం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
వి.కొత్తూరు	బాలికలు	సీఈసీ, ఎంఈసీ
జగ్గంపేట	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
చొల్లంగిపేట	బాలికలు	సీఈసీ, హెచ్‌ఈసీ
పిఠాపురం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
లోవకొత్తూరు	బాలికలు	--------
ముమ్మిడివరం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా		
రాజోలు	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
గోడి	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
గోడి	బాలురు	ఎంపీసీ, బైపీసీ (బాలురు)
పి.గన్నవరం	బాలురు	సీఈసీ, హెచ్‌ఈసీ (బాలురు)
ద్రాక్షారామ	బాలురు	ఎంపీసీ, బైపీసీ, సీఈసీ (బాలురు)

సద్వినియోగం చేసుకోండి



గురుకులాల్లో ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

–ఎ.మురళీకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్, ఏపీ సాంఘిక సంక్షేమ వసతి, విద్యాసంస్థలు

వేములపల్లిలో యువకుడి దారుణ హత్య

పాత కక్షలే కారణం



సంఘటన స్థలంలో పడిఉన్న శివ

మండపేట: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని రౌడీషీటర్ హత్య చేసిన ఘటన మండలంలోని వేములపల్లిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన బండి శివ (36) స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన హరీష్‌తో కలిసి మంగళవారం రాత్రి వేములపల్లి సమీపంలోని దూకుడుమెట్ట వద్ద మద్యం తాగేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి ఒంటి గంట వరకూ ఇద్దరూ మద్యం తాగారు. పాత గొడవలు ఘర్షణకు దారితీయడంతో హరీష్ స్క్రూడ్రైవర్ తీసుకుని శివ తలపై బలంగా పొడిచి పరారయ్యాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శివను బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటన స్థలాన్ని డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ పి.శివగణేష్, ఎస్‌ఐ బి.శివకృష్ణ పరిశీలించారు. అతన్ని 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హరీష్‌పై రౌడీషీట్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన జరిగిన సమయంలో హరీష్‌తో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుని కోసం గాలిస్తున్నట్టు ఎస్‌ఐ శివకృష్ణ వివరించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

పెనమలూరు: ఎన్టీఆర్ జిల్లా కానూరులోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలేనికి చెందిన ఎం.కాశీవిశ్వనాథ్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జశ్వంత్‌శ్రీసాయి (16) శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు జశ్వంత్ శ్రీసాయి చదువుకున్నాడు. అనంతరం హాస్టల్ కారిడార్‌లో ఇనుప తీగపై ఆరేసి ఉన్న దుస్తులు తీస్తుండగా ఏసీ వైరు దుస్తులు వేసిన తీగకు తగలటంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. పాఠశాల సిబ్బంది హుటాహుటిన జశ్వంత్‌శ్రీసాయిని కానూరులో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. విద్యార్థి తండ్రి ఎం.కాశీవిశ్వనాథ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగిన బతుకు బండి

- గామన్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం
- యువకుడితో పాటు గుర్రం మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పెళ్లిళ్లలో వధూవధులను ఊరేగించేది ఆ గుర్రపు బండే.. వేడుకలకు మరింత కళ తెచ్చే ఆ బతుకు చక్రం ఆగిపోయింది.. అనుకోని ప్రమాదం నిర్వాహకుడితో పాటు ఆ బండిని చిదిమేసింది.. గామన్ ఇండియా బ్రిడ్జిపై బుధవారం ఓ గుర్రపు బండిని లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఒక వ్యక్తితో పాటు గుర్రం మృతి చెందగా, మరొకరు, గుర్రం గాయాల పాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం...కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన సిద్ధిగాని వెంకటేష్ (23) వివాహ కార్యక్రమాలకు గుర్రం బండిని అద్దెకు ఇస్తుంటారు. వధూ వధూరులను గుర్రం బండిపై తీసుకెళ్లే పని చేస్తుండేవారు. ఈ నేపథ్యంలో కాకినాడలో జరిగే ఓ వివాహానికి గుర్రపు బండిని, రెండు గుర్రాలను తీసుకుని టాటా ఏస్ వాహనంలో తీసుకెళ్తున్నాడు. కొవ్వూరు దాటిన తర్వాత కాతేరు సమీపంలోని వచ్చేసరికి గామన్ బ్రిడ్జిపై గుర్రపు బండిని తీసుకెళ్తున్న వాహనం టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో వాహనంలోని గుర్రపు బండిని, గుర్రాలను కిందకు దింపి పంక్చర్ వేసుకుంటున్నాడు. ఆ సమయంలో వేగంగా వస్తున్న లారీ వీరిని బలంగా ఢీకొంది. దీంతో గుర్రపు బండి నుజ్జునుజ్జు అయ్యింది. లారీ వెంకటేష్ మీద నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో రోడ్డుపై ఉన్న గుర్రం, వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలవ్వగా మరో గుర్రం కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ప్రమాదంతో బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటేష్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. చనిపోయిన గుర్రాన్ని ప్రభుత్వ పశువుల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



గుర్రంపై మృతుడు వెంకటేష్ (ఫైల్)



ప్రమాద స్థలం వద్ద దెబ్బతిన్న గుర్రం బండి

దొమ్మేరులో విషాదం

కొవ్వూరు: గామన్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ మృతితో దొమ్మేరులో విషాదఛాయలు అలముకున్నాయి. ఇతనికి తల్లిదండ్రులతో పాటు ఒక సోదరి ఉంది. కుటుంబానికి ఇతనే జీవనాధారం. అతని శ్రమ మీదే కుటుంబం నడుస్తోంది. ఈ ఘటనతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వెంకటేష్‌కు మేనకోడలితో వివాహం చేయాలని అనుకున్నారు. ఇంతలో ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుడు వెంకటేష్ తాత, తండ్రి గుర్రపు బండి నడిపే జీవనం సాగించేవారు.